క్లుప్తంగా

సబ్‌స్టేషన్లను పరిశీలించిన ఏఈ



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏఈ రాంబాబు

పెదపాడు: నిరంత విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపడతున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ రాంబాబు తెలిపారు. గురువారం మండలంలోని ఏపూరు, కొక్కిరపాడు, విద్యుత్ సబ్ స్టేషన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ రాంబాబు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. వేసవిలో వీచే గాలులను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో బాగంగా సంబంధిత సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందిస్తున్నట్లు చెప్పారు.

కొనసాగుతున్న శిక్షణా తరగతులు



పోతునూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: విద్యార్థులు పరిశీలనా, పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని దెందులూరు గ్రంథాలయాధికారి రాజ్యలక్ష్మి, పోతునూరు గ్రంథాలయాధికారి డీ.జాన్‌బాబు అన్నారు. గురువారం దెందులూరు, పోతునూరు గ్రంథాలయాల్లో గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక వేసవి శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు నైపుణ్యత, క్రమశిక్షణ, సక్రమ పద్ధతిలో విద్యాబుద్దులు అనే అంశంపై అవగాహన కల్పించారు. కంప్యూటర్ బేసిక్స్‌లను వివరించి పత్రికలు, పుస్తకాలు చదివించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్.. గ్రామీణ ప్రజలకు వరం

గణపవరం : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గ్రామీణ ప్రాంత ప్రజలకు వరమని, ప్రభుత్వం ఎంతో ఉన్నతాయశంతో ప్రారంభించిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు వినియోగించుకుని అందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. గురువారం గణపవరం మండలం కాశిపాడు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం, 104 వైద్య సేవలు అందించారు. ఈసందర్భంగా ముగ్గురు గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందచేశారు. సాధారణ వ్యాధిగ్రస్తులు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ పిల్లలు బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. మంచానికే పరిమితమైన ఇద్దరు రోగులను పరీక్షించి మందులు అందచేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, డేటా ఆపరేటర్ వసంత, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఏఎన్‌ఎం శివకుమారి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి సొసైటీ, పలు ఎరువుల దుకాణాలను కైకలూరు ఏడీ గంగాధర్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లోని ఎరువులు, స్టాక్ రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా అంకన్నగూడెం, రాచన్నగూడెం గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాన్ని కూడా తనిఖీ చేశారు. అనంతరం ఏడీ గంగాధర్ మాట్లాడుతూ ఎంఆర్‌పీ రేట్లకే ఎరువులను విక్రయించాలని అన్నారు. అలాగే పలు బస్తాలను తూకం వేశారు. జీలుగుమిల్లి డీసీఎమ్ఎస్ గోడౌన్ ఇన్‌క్లూడింగ్ చేయించాలని షోకాజ్ నోటీసులు ఇచ్చారని తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చెట్ల నరికివేత

ద్వారకాతిరుమల : మండలంలోని కోడిగూడెంలో కొందరు అక్రమార్కులు ప్రభుత్వ స్థలంలోని విలువైన చెట్లను గురువారం నరికివేశారు. స్థానిక బోటుకుగుంట చెరువు గట్టుపై ఉన్న చెట్లను నరికి, కలపను అక్రమంగా తరలించే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న గ్రామస్తులు అక్రమ రవాణను అడ్డుకుని, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు.

ఖైదీలకు న్యాయ సహాయం

ఏలూరు రూరల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి రాజేశ్వరి గురువారం ఏలూరులో జిల్లా కారాగారాన్ని సందర్శించారు. ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కారాగాయంలో అందిస్తున్న ఆహారం, తాగునీరుతో పాటు మౌలిక వసతులను పరిశీలించారు. ఖైదీల కేసు వివరాలు, వారి ప్రవర్తనతో పాటు పొందుతున్న న్యాయ సహాయం గురించి కారాగార అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మట్లాడుతూ ఖైదీలు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అవసరమైన పక్షంలో న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు పొందడంలో సహకరిస్తామన్నారు. ఆమె వెంట చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు మునేశ్వరరావు, జిల్లా జైలర్ వెంకటరెడ్డి, శ్రీనివాసరావు ఉన్నారు.

వలంటీర్లు.. సంక్షేమ వారధులు

గ్రామాల్లో వలంటీర్లకు వందనం

దెందులూరు, పెదవేగి : పార్టీలు, మతాలు, కులాల కతీతంగా ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందించడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. వేకువ జామునే లేచి సామాజిక పింఛన్లు అందజేయడం మొదలుకుని ప్రతీ పథకాన్ని లబ్ధిదారులకు అందించి వారి మెప్పు పొందుతున్నారు. అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ముంగిటకు తీసుకెళ్లి అందిస్తున్నారు. ప్రభుత్వ ఆశయాలను నెరవేరుస్తూ సంక్షేమ సారథులుగా వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. కనీస గౌరవ వేతనంతో ప్రజలకు సేవలు అందిస్తున్న వారి సేవలను ముఖ్యమంత్రి గౌరవమిచ్చి సత్కరిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి వారు చేస్తున్న సేవలను గుర్తించి ప్రతీ ఏటా అవార్డులతో పాటు నగదు బహుమతిని అందిస్తున్నారు. ఈ ఏడాది దెందూలూరు నియోజకవర్గంలో 1306 మంది వలంటీర్లను సన్మానిస్తున్నట్లు తెలిపారు.

జగనన్న సైనికులుగా గుర్తింపు



మొదట్లో వలంటీర్లను చిన్న చూపుగా చూసిన వారంతా నేడు ముక్కున వేలు వేసుకుంటున్నారు. జగనన్న సైనికులుగా మాకు ప్రత్యేక స్థానం లభించింది. చాలా సంతోషంగా ఉంది. ప్రజలకు మా చేతులమీదుగా సంక్షేమ పథకాల లబ్ధిని అందించడం ఆనందంగా ఉంది.

– మేరుగు అనిల్, సేవా మిత్ర, పోతునూరు

సేవలు అభినందనీయం



గ్రామగ్రామాన వలంటీర్లు విధి నిర్వహణ, సేవలు అభినందనీయం, వారికి కేటాయించిన పరిధిని నిబంధనలు అనుసరిస్తూ ఒక్కొక్కసారి ఏ సమయమైనా ఓపికగ్గా ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్న వలంటీర్లందరూ మరింత మెరుగైన సేవలందించాలి.

– గంజి మనోజ్, ఎంపీడీఓ, పెదవేగి

రుణపడి ఉంటాం



ప్రభుత్వ పథకాల అమలులో వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసినందుకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి వలంటీర్లందరూ రుణపడి ఉంటారు. ప్రభుత్వ పథకాలు అమలుకు వలంటీర్లపై కీలక బాధ్యతలు ఉంచారు. ఆ బాధ్యతలను మేము సేవగా భావిస్తున్నాం.

– నరమామిడి వరలక్ష్మి, సేవా వజ్ర, వట్లూరు

వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శం



ఏ ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారో? ఆ ఆశయం నెరవేర్చడంలో వలంటీర్లు సఫలీకృతం అవుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలు అందించడంలో వలంటర్లు అందిస్తున్న సేవలు అభినందనీయం.

– కొఠారు అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్యే, దెందులూరు

పేదలకు సేవ చేస్తున్నందుకు పురస్కారం



పేద,బడుగు, బలహీన వర్గాల ప్రజలందరికీ వలంటీరుగా సేవలందిస్తున్నందుకు సేవా రత్న పురస్కారం పొందటం చాలా సంతోషంగా ఉంది. నా తల్లిదండ్రులకు, ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.

– జొన్నకూటి శివాజీ, సేవా రత్న, మేధినరావుపాలెం

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజలకు నేరుగా అందించాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు వలంటీర్లను ఏర్పాటు చేశారు. సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు అందిస్తున్నాం. మా సేవలను గుర్తించి పురస్కారాలు, నగదు ప్రోత్సాహకాలు అందించడం. ఎంతో ఆనందంగా ఉంది. వలంటీర్ల కృషిని గుర్తించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– తాతా విశ్వేశ్వరరావు, లక్ష్మీపురం వలంటీర్ (సేవా రత్న)

ప్రజలకు వారధి



ప్రజలకు మెరుగైన లబ్ధిదారు రీతిలో ఇంటివద్దకే ప్రభుత్వ పథకాలు చేరేలా చూడడం మా బాధ్యత. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నాం. అన్నివర్గాల ప్రజలకు మేలు చేయడమే ప్రభుత్వం ఉద్దేశం. వలంటీర్లు వాటిని అమలు చేయటం సంతృప్తినిస్తోంది. సేవా రత్న పురస్కారానికి ఎంపిక కావటం సంతోషంగా ఉంది.

– పొట్నూరి దుర్గా భవానీ, విజయరాయి–2 వలంటీర్ (సేవా రత్న)

సేవలకు గుర్తింపు



ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు అన్ని పథకాలు చేరువచేయటమే మా ప్రధాన కర్తవ్యం. దళారులు ఎవరూ లేకుండా నేరుగా సచివాలయాల్లో దరఖాస్తు చేయడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుబాటులోకి తీసుకురావడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనం. సేవారత్న పురస్కారానికి ఎంపిక చేయడం ఆనందంగా ఉంది.

– పామర్తి నాగపూర్ణిమ, వలంటీర్ పినకడిమి (సేవా రత్న)

కట్టుబడి ఉన్నాం



రాష్ట్రంలోని పేదలందరికీ అన్నగా, మామయ్యగా అనుబంధాల ను పంచుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సేవ చేస్తున్నందుకు గర్వంగా ఉంది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా సర్వేలు చేపట్టి నిజమైన అర్హులకు న్యాయం చేస్తున్నాం. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవ చేస్తున్న మమ్మల్ని గుర్తించి అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉంది.

– ఆనంద్, కొప్పులవారిగూడెం, వలంటీర్ (సేవా రత్న)

స్పందన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి



వట్లూరు వీఆర్వో కార్యాలయాన్ని సందర్శించిన తహసీల్దార్ జీ విజయ్‌కుమార్ రాజు

పెదపాడు: మండలంలోని వట్లూరుకు ఓ మహిళకు బోగాపురం రహదారి నిర్మాణంలో భాగంగా నష్ట పరిహారం అందించలేదని స్పందనలో ఫిర్యాదు చేసింది. దీంతో పెదపాడు తహసీల్దార్ వట్లూరు వీఆర్వో కార్యాలయాన్ని సందర్శించారు. సంబంధిత ఫిర్యాదుకు క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపాలని తమ పరిధిలో లేకుండా సంబంధిత వివరాలను ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ఆర్ఏఎస్ఆర్ చంద్రమూర్తి, దామరాజు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

పెదపాడు: మండలంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలు కావడంతో పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని కలపర్రు గ్రామానికి చెందిన నూకల వెంకట రామచంద్రరావు కలపర్రు గ్రామంలో రహదారిపై సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని మోటారు సైకిల్ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై బీ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

వలంటీర్లు.. జగనన్న బలం



వలంటీర్‌ను సత్కరిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు : ప్రభుత్వ సంక్షేమ పథకాలను బాధ్యతగా, సేవా దృక్పథంతో నిరంతరం ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని, వారే జగనన్నకు బలం అని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కొనియాడారు. గురువారం ఉంగుటూరులో డాక్టర్ పాతూరి శివన్నారాయణ కమ్మ కళ్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సచివాలయాల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వాసుబాబు మాట్లాడారు. అవినీతికి తావు లేకుండా ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. రానున్న ఎన్నికలు పేదలకు, సంపన్నులకు మధ్య జరిగే పోరాటమని, జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించి ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలన్నారు. జగన్ సీఎంగా ఉంటే పదేళ్లలో ఆర్థిక అసమానతలు తొలగిపోతాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు చేరవేస్తూ వారి ముఖాల్లో చిరునవ్వు చూసే భాగ్యం వలంటీర్లకు దక్కిందన్నారు. వైఎస్ జగన్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా వలంటీర్లు లబ్ధిదారులను చైతన్య పరచాలన్నారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ వీవర్సు జిల్లా అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, పార్టీ సచివాలయాల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, పార్టీ మండల కన్వీనర్ మరడ మంగారావు మాట్లాడుతూ ప్రజల ఆశీర్వచనాలు ప్రభుత్వానికి ఉండేలా వలంటీర్లు పని చేయాలని కోరారు. సమావేశంలో వలంటీర్లకు శాలువాలు కప్పి సత్కరించారు. నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శింగిరెడ్డి సూర్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు మంద జయలక్ష్మి, ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, సర్పంచ్ చాంబర్ అధ్యక్షుడు పుత్సకాయల విష్ణుమూర్తి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయండి



ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: దెందులూరులో కాశీకాలనీలో రామాలయం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖాధికారులకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సూచించారు. కాశీకాలనీ నిర్వాసితులు రామాలయం నిర్మాణం అవశ్యకతను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం నాలుగు మండలాల నుంచి స్వయం ఉపాధి, రుణాలు, ఇళ్ల స్థలాలు, వ్యక్తిగత అవసరాలు, ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల ఉద్యోగులకు ఎమ్మెల్యే సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండే లాజర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గాలాయగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

దెందులూరు : గాలాయగూడెం పంచాయతీలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజా సమస్యలు తెలుసుకుంటారన్నారు. అన్ని శాఖల ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

హోర్డింగులు, బోర్డుల తొలగింపు



భీమడోలు జంక్షన్ వద్ద డివైడర్‌పై ఉన్న బోర్డులను తొలగిస్తున్న దృశ్యం

భీమడోలు : రహదారి డివైడర్లపై అక్రమంగా ఏర్పాటు చేసిన హోర్డింగులు, ఐరన్ బోర్డులు, ఫ్లెక్సీలను రోడ్డు భవనాల శాఖ అధికారులు తొలగించారు. భీమడోలు జంక్షన్ నుంచి ద్వారకాతిరుమల వరకు రోడ్డు డివైడర్లలో మొక్కలను నాటి సుందరంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టారు. అయితే రాజకీయ నాయకులు, వ్యాపార సంస్థలు ప్రచారానికి వేదికలుగా డివైడర్లలో హోర్డింగులు, ఫెక్లీలు, ఐరన్ బోర్డులను ఏర్పాటు చేసుకున్నారు. దీని వల్ల అధికారులు నిర్దేశించిన లక్ష్యం నెరవేరడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ డివైడర్లపై అక్రమంగా ఎటువంటి బోర్డులు, హోర్డింగులు ఉండరాదని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో భీమడోలు ఆర్‌అండ్‌బీ ఏఈ జె.భాస్కరరావు ఆధ్వర్యంలో రెండు రోజులుగా జేసీబీలు, కూలీలతో డివైడర్లలోని ఏర్పాటు చేసిన వాటిని తొలగించారు. సుమారు 16 కిలోమీటర్లలో 97 బోర్డులను తొలగించామని ఏఈ పేర్కొన్నారు.

మంద కృష్ణ మాదిగ పర్యటనను విజయంతం చేయండి

దెందులూరు: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ శుక్రవారం ఏలూరు పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కే.మురళీకృష్ణ కోరారు. మంద కృష్ణమాదిగ వికలాంగులకు రూ. 6 వేలు పెన్షన్ పెంచాలని ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమానికి విచ్చేస్తున్నారని అనంతరం తంగెళ్ళమూడి వద్ద మిషన్ ఆఫ్ ఛారిటీ ఆశ్రాన్ని పరిశీలిస్తారన్నారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్ విభాగాల ప్రతినిధులు హాజరై విజయవంతం కావాలని కోరారు.

విధుల్లోకి చేర్చుకోవాలంటూ నిరసన

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా పనిచేస్తున్న వ్యక్తిని విధుల్లో నుంచి తొలగించారని తనకు మళ్ళీ ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ నిరసన తెలిపాడు. ఆర్‌ఆర్‌పేట నగరపాలక సంస్థ వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. వెంటనే స్పందించిన ఏలూరు టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి... ఏలూరు చాణిక్యపురికాలనీ 2వ రోడ్డు ఏటిగట్టు ప్రాంతానికి చెందిన డి.సూరిబాబు ఏలూరు నగరపాలక సంస్థ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా వాటర్ ట్యాంక్ వద్ద పనిచేస్తూ ఉంటేవాడు. ఇటీవల అతను అనారోగ్యంతో విధులకు హాజరుకాకపోవడంతో అధికారులు అతన్ని విధుల నుంచి తప్పించారు. తనను మళ్లీ ఉద్యోగంలో చేర్చుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం రాత్రి ఆర్‌ఆర్‌పేట వాటర్ ట్యాంక్ వద్ద ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపులకు దిగాడు.

చిరుధాన్యాల సాగుపై ఆసక్తి చూపాలి

పోలవరం రూరల్ : ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన రైతులు చిరు ధాన్యాల పంటలపై ఆసక్తి చూపాలని ఐకేపీ ఏపీఎం బి.శ్రీనివాసరావు తెలిపారు. పోలవరం మండలం గడ్డపల్లి, గిన్నేపల్లి, తంగేడుకొండ, చిలకలూరు, దార్వాడ గ్రామాల్లో ఆయన గురువారం చిరు ధ్యాన్యాల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలవరం రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ద్వారా ఈ ఏడాది 500 ఎకరాల్లో చిరుధాన్యాల పంటలను పండించేందుకు సిద్ధం కావాలన్నారు. జొన్న, చోళ్లు, గంటెలు తదితర చిరుధాన్యాలను సాగుచేయాలన్నారు. డీఆర్‌డీఏ, ఐటీడీఏ ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన నిర్వహించడం జరిగిందన్నారు. రైతులకు రూ.2వేలు పెట్టుబడి కూడా అందజేస్తున్నామన్నారు. దీంతో ఆ ప్రాంతంలోని రైతులు సాగుచేసేందుకు ముందుకు వచ్చారని తెలిపారు.

పిల్లలను తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించాలి

చింతలపూడి : కుటుంబ వ్యవస్థలోని మార్పులే పిల్లలు తప్పిపోవడానికి ప్రధాన కారణంగా నిలుస్తుందని, తల్లితండ్రులు వారి పిల్లలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ సి.మధుబాబు అన్నారు. వరల్డ్ చిల్డ్రన్ మిస్సింగ్ డే సందర్భంగా చింతలపూడి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. కుటుంబం నుంచి తప్పిపోయిన పిల్లలు తారసపడితే వారిని పోలీసులకు గాని, అంగన్‌వాడీలకు గాని, 1098 చైల్డ్‌లైన్ వారికి సమాచారం ఇచ్చి అప్పగించాలని సూచించారు. పిల్లలు తప్పిపోవడానికి కారణం కుటుంబ వ్యవస్థలోని లోపాలే అన్నారు. పిల్లల విషయంలో తల్లితండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. అలాగే కొంతమంది ముఠాలు పిల్లలను అపహరించడం, కొంమతంది ప్రేమ పేరుతో పిల్లలను మోసం చేస్తున్నారన్నారు. అత్యధిక శాతం పిల్లలపై దాడులు చేస్తే పోక్సో చట్టం ద్వారా శిక్షలు ఉన్నాయని తెలిపారు. కావున పోలీసులు, అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు పిల్లలకు కల్పించిన రక్షణ చట్టాలను తెలియజేస్తూ, చిన్నారులు వారి బాల్యాన్ని కోల్పోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పట్నాల శ్రీనివాస్, ఎల్‌వీ చైతన్య, బుళ్ల ఏసుపాదం, చింతలపూడి సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరవవు, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పి.మాధవి, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

2న చండీహోమం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో జూన్ 2వ తేదీన చండీహోమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. జ్యోతిష్య వాస్తు ఆగమ సిద్ధాంతి ఈరంకి సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చండీహోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించాలని కోరారు.

క్రమశిక్షణ, సమయపాలన అలవర్చుకోవాలి



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమడోలు : క్రమశిక్షణ, సమయపాలన విద్యార్థి దశ నుంచి అవలంభిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఆర్మీ హవాల్దర్ యర్రంశెట్టి కృష్ణ కిషోర్ అన్నారు. భీమడోలు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన చిన్నారులకు త్రివిధ దళాలపై అవగాహన కల్పించారు. దేశ రక్షణకు త్రివిధ దళాలు అనునిత్యం కంటికి రెప్పలా పనిచేస్తాయన్నారు. చిన్నతనం నుంచే లక్ష్యాన్ని నిర్ధేశించుకుని దానికనుగుణంగా సాధన చేస్తే విజయం సాధించాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. గ్రంథ పాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, సత్యేంద్ర స్కూలు ప్రిన్సిపాల్ పోలిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, రిసోర్స్‌పర్సన్ ఈతకోట భవ్యశ్రీ చిన్నారులకు నీతి కథలు, స్పోకెన్ ఇంగ్లిషు తదితర అంశాలపై శిక్షణ అందించారు. పూళ్లలో గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో చిన్నారులకు యోగా గురువు కురెళ్ల కిషోర్ ఆధ్యాత్మిక అంశాలపై శిక్షణ అందించారు. గుండుగొలనులో గ్రంథపాలకురాలు జి.నాగమణి చిన్నారులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం చేయించారు.

75 మందికి కంటి వైద్యసేవలు



చిలకంపాడులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం : వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం గ్రామీణ ప్రాంతాలలోని వృద్ధులకు వరమని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని, కంటి సమస్యలనుంచి బయటపడాలని చిలకంపాడు సర్పంచ్ చుక్కా అప్పారావు, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటనారాయణ అన్నారు. గురువారం చిలకంపాడు గ్రామ సచివాలయం పరిధిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 60 ఏళ్లు నిండిన అవ్వాతాతలకు వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వ్యాధులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యసహాయం పొందాలని, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని కనీసం వారానికి మూడు సార్లు ఆకుకూరలు తినాలని సీహెచ్‌వో జాలాది విల్సన్ సూచించారు. ఈసందర్భంగా 75 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరందరికీ కళ్లజోళ్లు ఉచితంగా అందచేస్తామని ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు చెల్లించకుంటే ఆందోళన చేస్తాం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు

భీమడోలు : సూరప్పగూడెంలోని హారిక సీ ఫుడ్స్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లో పని చేస్తున్న కార్మికులకు ఏడాదిగా జీతం ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ఏడాది కాలంగా ఇక్కడ పని చేస్తున్న 11 మంది కార్మికులకు జీతం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, రూ.4 నాలుగు లక్షలు బకాయిలు చెల్లించాలని, అడిగితే యాజమాన్యం కార్మికులను వేధింపులకు గురిచేస్తోందన్నారు. మంగళవారం నాటికి వేతనాలు ఇవ్వని పక్షంలో నిరవధిక దీక్షను చేపడతామన్నారు. తక్షణమే కార్మికులకు జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధిత కార్మికులు ఉప్పు మాణిక్యాలరావు, బాబూరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : ఇద్దరు యువకులు తనను, తన అక్కను వేధిస్తున్నారని, వారిపై చర్య తీసుకోవాలని ఎ.పోలవరానికి చెందిన యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎ.పోలవరానికి చెందిన యువతి చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతోంది. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన వనపర్తి పవన్, వనపర్తి సతీష్ తనను, తన అక్కను ప్రేమిస్తున్నానని వెంటపడి వేధిస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఈనెల 18వ తేదీన ఇంటి సమీపానికి వచ్చిన ఇద్ద రు యువకులు అసభ్యకరంగా వ్యవహరిస్తూ, వారిని ప్రేమించకపోతే చంపుతామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొందన్నారు.